విముక్త

పద్నాలుగేళ్ళ వనవాసాన్నీ, అనేక కష్టాలనూ, అనంత సాగరాన్నీ దాటి అయోధ్య తిరిగివచ్చిన సీతారామలక్ష్మణులను స్వాగతించటానికి అంతఃపురమంతా కదలి వచ్చింది.

ఒక్క ఊర్మిళ తప్ప!

ఆత్రంగా వెదకిన సీత కళ్ళకు ఊర్మిళ ఎక్కడా కనిపించలేదు. అత్తగార్ల ఆలింగనాలూ, కుశల ప్రశ్నలు, మాండవి, శ్రుత కీర్తుల స్నేహపు పలుకులు సేవలు- ఇవేమీ సీత మనసుకెక్కటం లేదు.

"ఊర్మిళ ఏది? ఆరోగ్యంగా లేదా?" హడావుడి కొద్దిగా నిమ్మళించిన తర్వాత చెల్లెలు శ్రుతకీర్తిని దగ్గరకు తీసుకుని మెల్లిగా అడిగింది సీత.

"ఊర్మిళ ఏది?"

శ్రుతకీర్తి ముఖం వివర్ణమైంది. ఆమె ముఖం చూసి సీతకు భయం వేసింది.

"ఊర్మిళ కేమయింది? కుశలమే కదా?"

సీత ఆందోళన అర్థమైనా ఏం చెప్పాలో తెలియలేదు శ్రుతకీర్తికి.

ఆమె ఊర్మిళను చూసి పధ్నాలుగేళ్ళయింది.

“మాట్లాడకుండా అలా చూస్తావేమిటి? ఊర్మిళ ఏది? ఎలా ఉంది?” సీత ఆందోళనగా అడిగింది.

“ఊర్మిళ ఎలా ఉందో నాకు తెలియదు. అక్కను నువ్వెళ్ళిన నాటినుంచీ చూడలేదు”

సీతకేమీ అర్థం కాలేదు. తను పొరపాటుగా వింటున్నాననుకుంది. గట్టిగా మళ్ళీ

“శ్రుతకీర్తీ- నేను ఊర్మిళ గురించి అడుగుతున్నాను.” అంది.

“నేనూ ఊర్మిళ గురించే చెప్తున్నాను. మీరు వెళ్లాక ఊర్మిళ ఎవరికీ కన్పించలేదు. తన మందిరంలోంచి బైటికి రాలేదు. ఎవరినీ లోపలకు రానివ్వలేదు.”

నిర్ఘాంత పోయింది సీత.

“ఎవ్వరినీ! అత్తగార్లను కూడా”

“ఎవరినీ రానివ్వలేదు. దాసీలు మాత్రం వస్తూ పోతూ ఉన్నారు. ఆమె గదిలోకిప్రవేశం ఒక్క చారుమతి అనే ఆమెకే ఉంది. ఆమె ఊర్మిళ యోగక్షేమాలు మాకు చెబుతుంది.”

సీతకు ఊపిరాడనట్లయింది.

పధ్నాలుగేళ్ళు మనుషులతో మాట్లాడకుండా- తనవాళ్ళను చూడకుండా ఎట్లా ఉంది. అట్లా ఉండాలని నిర్ణయించుకోటానికి ఆమె మనసు ఎంత గాయపడి ఉండాలి. పధ్నాలుగేళ్ళు! ఆమె రామలక్ష్మణులనూ, తననూ క్షమిస్తుందా?

“ఇవాళ మేం వస్తున్నాం అన్న వార్త ఊర్మిళకు తెలుసా?”

శ్రుతకీర్తి తలదించుకుంది.

సీత వెంటనే రాముని దగ్గరకు వెళ్ళాలని చూసింది గానీ మంత్రులు, తమ్ముళ్ళు పుర ప్రముఖులు మోహరించిన ఆ సమయంలో రామలక్ష్మణులను సమీపించటం అసాధ్యమనిపించింది.

ఇంతలో శ్రుతకీర్తి ఒక స్త్రీని తీసుకొచ్చింది.

“ఈమే చారుమతి” సీత ఇంక ఆలస్యం చెయ్యలేదు.

“పదమ్మా- ఊర్మిళ దగ్గరకు వెళదాం”

“ఆమె ఎవరినీ చూడదు” అంది చారుమతి ముక్తసరిగా.

"ఎవరివల్ల ఆమె అందరికీ దూరంగా బతుకుతోందో వాళ్ళే వచ్చారని తెలిస్తే ఆమె వారిని తప్పక చూస్తుంది. పద"

సీత చారుమతిని నడవమని కళ్ళతోనే ఆజ్ఞాపించింది. ఊర్మిళ మందిరం వందల యోజనాల దూరం ఉన్నట్లనిపించింది సీతకు. ఎంత నడిచినా రాదేం.....

***

అరణ్యవాసమంతా లక్ష్మణుడితో పాటు ఊర్మిళా తమతో ఉంటే ఎంత బాగుండేది అనిపిస్తూనే ఉండేది సీతకు. రామలక్ష్మణులు తమ పనులలో అరణ్య సంచారంలో ఉంటే తనూ, ఊర్మిళా కలిసి అరణ్య సౌరభాలను ఆస్వాదించేవారు గదా అనుకునేది.

ఎందుకు లక్ష్మణుడు ఊర్మిళను తీసుకురాలేదు? ఆ విషయం ఎప్పుడు ప్రస్తావించినా మౌనం తప్ప పెదవి విప్పడు లక్ష్మణుడు.

తాము అడవికి వచ్చేటప్పుడు అంతా గందరగోళం. అయోమయం.

దశరథుని అనారోగ్యం, కౌసల్య దుఃఖం, అంతఃపురమంతా అల్లకల్లోలమైంది. తాను రాముని వెంట వెళ్ళటానికి అందరినీ ఒప్పించటమే పెద్ద పనయింది. తీరా సరయూ నది దాటుతుండగా మనసు స్థిమితపడినపుడు ఊర్మిళ తమతో రావటం లేదనే విషయం గట్టిగా మనసును తాకింది. ఈ మొత్తం గొడవలో ఊర్మిళ అసలు జోక్యమే తీసుకోలేదనీ, తమకు వీడ్కోలు కూడా చెప్పలేదనీ గ్రహించిన తరువాత సీత ఆందోళన పెరిగింది.

దానితో రాముడిని పదే పదే ప్రశ్నించేది.

'ఊర్మిళ వస్తానన లేదా? లక్ష్మణుడు ఒంటరిగా వస్తుంటే ఆమె ఎంత దుఃఖించిందో అరణ్యవాసం దుస్సహమనుకుందా? అలాగయితే లక్ష్మణుడు అయోధ్యలో ఉంటేనే బాగుండేది గానీ మనకోసం ఊర్మిళను ఒంటరిదాన్ని చేసి రావటం సమంజసమా?"

ఇలా మాట్లాడుతున్న సీతను రాముడు సమయానుకూలంగా సమాధాన పరిచేవాడు. అయోధ్యలో అత్తగార్ల సేవకు ఊర్మిళ ఉండాలి. కౌసల్యను చూసుకునే వారెవరు? భర్తృహీన, పుత్ర వియోగి అయిన అత్తగారికి అండగా లేకుండా సీత వనవాసానికి వచ్చేసింది. ఆమెకు ఊర్మిళ తప్ప ఎవరున్నారు? ముగ్గురు అత్తగార్లకూ ముగ్గురు కోడళ్ళయినా ఉండొద్దా. ముఖ్యం అమ్మ కౌసల్యను అనుక్షణం కాపాడాలిగదా.

రాముడు ఇంకా ఎన్నో చెప్పేవాడు.

అంతఃపురంలో నిర్వహించాల్సిన బాధ్యతలెన్నో ఉంటాయి. అవి మహారాణిగా కౌసల్య ఎంతో సామర్ధ్యంతో నిర్వహించేది. ఇప్పుడామెకు శక్తి చాలదు. ఆసక్తి అసలే ఉండదు. ఆ నిర్వహణ భారం ఊర్మిళ తప్ప ఎవరు మోయగలరు?

"సీతా చెప్పు- ఈ విషయంలో నీకంటే ఊర్మిళ సమర్ధురాలు కదూ? మనం అయోధ్యలో ఉన్నపుడు అమ్మ నీకంటే ఊర్మిళకు ఎక్కువ బాధ్యతలు అప్పజెప్పేది కదూ?"

"ఔను" అని ఆలోచనలో పడేది సీత. ఊర్మిళ లౌకిక వ్యవహారాలలో చాలా సమర్ధురాలు. చూపుతో శాసించగలదు. రాణీ వాసాలలో జరిగే సమస్త విధులూ ఆమెకు తెలుసు. తండ్రి కూడా ఆ విషయంలో చెల్లినే ప్రశంసించేవాడు.

"నీకు విలువిద్యలో, ఉద్యానవన విహారాలలో ఉన్న ఆసక్తి మిగిలిన విషయాలలో లేదమ్మా" అనేవాడు.

నిజమే. ఆ అంతఃపుర అధికారాలూ, వాటి నిర్వహణ సీతకే మాత్రం నచ్చేవికావు. ఉద్యానవనంలో ఆటలు, విలువిద్యాభ్యాసం, ప్రకృతిలో సేదదీరటం యివే చాలు సీతకు. అయోధ్య వచ్చిన తర్వాత కూడా అత్తగారినుంచి బాధ్యతలు తీసుకునే ఆసక్తి చూపలేదు. ఊర్మిళ మాత్రం కౌసల్య వెంటే ఉండేది.

సీతకు అంతఃపురం కంటే అరణ్యమే హాయిగా ఉంది. ఇక్కడ స్నేహం చేయటానికీ, గౌరవించటానికీ మనుషులుంటారు గానీ అధికారం చలాయించేందుకు కాదు. ఈ సహవాసమే సీతకు పరమ ప్రియంగా ఉంది.

"నీకు ప్రియమైనది ఊర్మిళకు ప్రియమవ్వాలని లేదుగా. నువ్వు భూపుత్రివి. ప్రకృతి ప్రేమికురాలివి. ఊర్మిళకు నగర జీవితం, అంతఃపుర బాధ్యతలూ ప్రియం కావచ్చుగదా" రాముడెంత సముదాయించినా సీత ఊర్మిళ కోసం దిగులు పడేది.

భర్త వియోగాన్ని భరించటం అన్నిటికంటే పెద్ద కష్టం కదా-

రావణుని చెరలో అదెంత పెద్దకష్టమో సీతకు బాగా అర్ధమైంది.

సీత ప్రకృతి ప్రేమికురాలని తెలిసి రావణుడు ఆమెను అశోకవనంలో ఉంచాడు. ఆ వన సౌందర్యం వర్ణనాతీతం. మిథిలలో అయోధ్యలో ఎక్కడాలేని వనవైభవం. రావణునికి పిచ్చి ప్రేలాపనలే గాని సీతను తేరిపార చూసే ధైర్యం కూడా లేదు. సీతకతను తృణప్రాయం.

ఐనా అపహరణకు గురై పతి తన రక్షణార్ధం వస్తాడని కూర్చోవటం సీతకు నరక ప్రాయంగా ఉండేది.

రాముడు వస్తాడు. రావణుని సంహరిస్తాడు. దీనిలో సీతకే సందేహమూ లేదు. తనను తాను రక్షించుకోగల శక్తిని నియంత్రించుకుని ఏ ప్రయత్నమూ చేయకుండా కూర్చోవటమే అసహనంగా ఉండేది.

రాముని మనసు సీతకు తెలుసు. రావణ సంహారం తానే చెయ్యాలనే రాముని సంకల్పం ముందు సీత ప్రతాపం వెనక్కు తగ్గక తప్పలేదు.

"మన అనుబంధంలో మీకు చాలా ఇష్టమైనదేమిటి?" అని అడిగింది సీత ఒక రోజు.

"నిన్ను కంటికి రెప్పలా కాపాడుకోవటం. నీ కాలిలో ముల్లు దిగినా నేనే తియ్యాలి. నిన్ను సమీపించబోయే క్రూరమృగాలను నేను సంహరించాలి. నిన్ను రక్షిస్తున్నాననే భావన నాకు అయోధ్యా సామ్రాజ్య సార్వభౌమత్వం కంటే ఎక్కువ గర్వాన్నీ ఆనందాన్నీ కలిగిస్తుంది" అన్నాడు రాముడు.

"నన్ను నేను రక్షించుకోగలను. విలువిద్యలో మీకు తీసిపోను" అంది సీత నవ్వుతూ రాముని ముఖం చిన్నబోయింది.

"నేను జీవించి ఉండగా నిన్ను నువ్వు రక్షించుకునే అవసరమే రాదు. రాకూడదు. నువ్వు నాకోసం చూడాలి. నా బలమైన బాహువుల రక్షణకోసం చూడాలి. అలా కాక నిన్ను నువ్వే రక్షించుకుంటే యిక నేనెందుకు? అలా ఎన్నడూ చెయ్యనని వాగ్దానం చెయ్యి"

సీత రాముని చేతిలో చేయి వేసింది.

అపహరణ, అశోకవనంలో నిరీక్షణ తప్ప సీతకు మరో మార్గం లేకుండా పోయింది. అప్పుడు ఆ పతీ వియోగవ్యథలో ఊర్మిళ ప్రతిక్షణం గుర్తొచ్చేది.

"ఎలా సహిస్తోంది ఊర్మిళ? నా ప్రియమైన చెల్లీ. ఎందుకక్కడ ఉన్నావమ్మా.

ఆ అంతఃపురంపై అంత మక్కువ ఎందుకమ్మా" అని ఊర్మిళను కూడా తన దుఃఖార్తిలో కలుపుకునేది.

చివరకు రావణ సంహారం జరిగింది. అగ్నిపరీక్ష గడిచింది.

'అయోధ్య సీతారాముల రాకకు నిరీక్షిస్తోంది' అని రాముడు సగర్వంగా చెప్పినప్పుడూ సీతకు ఊర్మిళను చూడాలనే తహతహే!

"ఊర్మిళకు ఎంత ఆనందంగా ఉందో. తన మందిరాన్ని ఎంత సుందరంగా అలంకరింప చేసిందో. తను లక్ష్మణుడి ఎదుట పడే క్షణం కోసం ఎంత అలంకరణ చేసుకుంటుందో. అంతఃపురం చేరగానే అత్తగార్లకు నమస్కరించి లక్ష్మణునితో పాటు ఊర్మిళ దగ్గరకు వెళ్ళాలి. లక్ష్మణుని ఊర్మిళకు అప్పగించి వారి సంబరం చూసి- కొద్ది నిముషాలు వారి ఏకాంతానికి భంగం కలిగించినా సరే- ముందు ఊర్మిళ మందిరానికి వెళ్ళే తన మందిరానికి వెళ్ళాలి." ఆ దృశ్యాన్ని పదేపదే ఊహించుకుని ఆనందం పొందుతున్న సీతను చూసి

"ఆనందంతో వెలిగిపోతున్న నీ వదనం ఎంత అందంగా ఉంది. సీతా" అన్నాడు రాముడు.

"ఊర్మిళ ఆనందం ఊహించుకున్నంత మాత్రానే నా మనసుకు ఎంతో హాయిగా ఉంది." అంది సీత మధురంగా నవ్వుతూ.

రాముడు కూడా సీత సంతోషాన్ని పంచుకున్నాడు. ఇద్దరూ అర్థవంతంగా లక్ష్మణుని చూసి నవ్వుకున్నారు.

తన కోసం పద్నాలుగేళ్ళు భార్యా వియోగం సహించిన తమ్ముని చూసి గర్వంతో ఉప్పొంగింది రాముని హృదయం.

లక్ష్మణున్ని దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

అయాచితమైన అన్నగారి కౌగిలిలోని ఆత్మీయతకు లక్ష్మణుడూ పులకితుడయ్యాడు. నగరం చేరువవుతున్నకొద్దీ ముగ్గురి మనసులూ పున్నమి రాత్రి అలలతో ఎగసిపడే సాగరాల్లా ఉన్నాయి.

ఎన్నో ఆలోచనలు, జ్ఞాపకాలు- వింత అనుభూతితో, ఎంతో ఉద్వేగంతో వస్తే హృదయానికి హత్తుకోవటానికి ఊర్మిళ ఎదురుపడలేదు.

హృదయాన్ని చీలుస్తూ ఊర్మిళ తనకు తాను విధించుకున్న పధ్నాలుగేళ్ళ అజ్ఞాతవాస వార్త!

***

ఊర్మిళ మందిరం వెలుపలంతా అలంకరించారు. ఆమె గది తలుపులు మాత్రం తెరుచుకోలేదు. చారుమతి మెల్లిగా తలుపు మీద తట్టి

"అమ్మా- మీ సోదరి జానకీదేవి మిమ్మల్ని చూడాలని వచ్చారు." అన్నది.

సీత మనసు మనసులో లేదు.

'ఎలా ఉంటుంది ఊర్మిళ. ఏమంటుంది? తననేం అడుగుతుంది. తనేం చెప్పాలి?' తలుపులు తెరుచుకోలేదు.

సీత తనే స్వయంగా పిలిచింది.

"ఊర్మిళా– నేనమ్మా అక్కయ్యను వచ్చాను. అంతా చెబుతాను. మమ్మల్ని క్షమించి తలుపు తెరువు"

ఊర్మిళ గది తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా ఊర్మిళ. సీత ఒక్క క్షణం దిగ్భ్రమ చెందింది. సీతకు తెలిసిన ఊర్మిళ కాదీమె. మునుపు ఆ కళ్ళలో కొంత అమాయకత్వం ఉండేది. మరికొంత రాచరికపు దర్పం ఉండేది. శరీరపు తీరుచాలా ఠీవీగా రాణిలా ఉండేది. ఇప్పుడు ఆ రెండు కళ్ళలో వెలుగుతున్నదేమిటి? ఇప్పుడామె శరీరంలో ఏదో తెలియని సంయమనం, గాంభీర్యం. ముఖంలో ఆ తేజస్సు ఏమిటి? సీత తెప్పరిల్లుకుంటున్నపుడు ఊర్మిళ వచ్చి అక్కగారి పాదాలకు నమస్కరించి ఆసనం మీద కూర్చోబెట్టింది.

"ఊర్మిళా– పద్నాలుగేళ్ళూ నీ గురించి ఆలోచిస్తున్నాను. ఎంతో బాధపడుతున్నాను" సీత కళ్ళల్లో కన్నీరు మరి ఆగనంటూ బైటికురికింది.

"మామీద నీకు కోపం ఉండొచ్చు"

ఊర్మిళ ప్రేమగా గంభీరంగా నవ్వింది.

"నాకెవరిమీదా కోపం లేదు"

"మరి ఎందుకిట్లా అందరికీ దూరంగా– కోపం లేకపోతే ఇట్లా ఒక గదిలో బందీవవుతావా? నీ కోపాన్ని ప్రదర్శించు. ఆగ్రహించు. కానీ ఇలా ఎవరికీ కాకుండా పోకు. అసలేం జరిగిందో, ఇలా ఎందుకు చేస్తున్నావో చెప్పు"

ఊర్మిళ నవ్వింది.

"చెప్తానక్కా – నీకు కాక ఇంకెవరికి చెబుతాను? నీకు తప్ప ఎవరికీ అర్థం కాదు. అందుకే మౌనంగా ఉన్నాను."

సీత ఉత్సుకతతో ఎదురుచూస్తోంది.

"అక్కా నేను కోపంతోనే మొదట ఈ గది తలుపులు మూశాను.

నా భర్త నాతో ఒక్కమాట చెప్పకుండా, నా నిర్ణయంతో ప్రమేయం లేకుండా నేననేదాన్ని ఒకదానిని ఉన్నాననే ఆలోచన లేకుండా, అన్నగారే సర్వస్వమని వెళ్ళిపోయాడు. ఆనాడు కోపంతో దహించుకుపోయాను. ఈ అంతఃపురాన్ని నా తిరుగుబాటుతో తల్లకిందులు చేయాలనుకున్నాను.

అందరూ మీ కోసం దుఃఖిస్తున్నారు. నావైపు చూసేవారే లేరు. నిస్సహాయ ఆగ్రహం- నేనూ ఎవరినీ చూడదల్చుకోలేదు. సత్యాగ్రహం ప్రారంభించాను"

సీత మనసు అప్పటి ఊర్మిళను పట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

"మొదలు పెట్టినపుడది ఆగ్రహమే- కానీ క్రమంగా అది సత్యం కోసం నాలో నేను, నాతో నేను చేసే అన్వేషణగా మారింది. నాకెందుకింత కోపం, నన్ను నేను కాల్చేసుకునే కోపం. నాకెదురైన ప్రతివారినీ దహించాలనే కోపం. నాకెందుకీ దుఃఖం. కారణం తెలుసు. కానీ ఆ కారణం లోపలికి లోలోపలికి చూడాలనే తహతహ ఒకటి నాకు తెలియకుండానే పుట్టుకొచ్చింది. కోపం ఏమిటి? దుఃఖం ఎందుకు? ఆనందం దేనికి? నా శరీరానికీ, నాలో కలిగే ఈ ఆవేశాలకూ, ఉద్వేగాలకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఇట్లా ఎన్నో ప్రశ్నలు- అవి నన్ను లీనం చేసుకున్నాయి. నా శరీరాన్ని గమనించటం, నా ఆలోచనలు, అవి నాలో రేకెత్తించే ఉద్రేకాన్ని గమనించటంతో మొదలుపెట్టాను. ఈ గమనికకు ఎలాంటి అంతరాయం కలిగినా నాకు అశాంతిగా ఉండేది. అందుకే నేను ఏకాంతాన్ని కోరుకున్నాను. ఒంటరితనాన్ని కాదు. ఏకాంతాన్ని. నాలో నేను, నాతో నేను సంభాషించుకునే ఏకాంతాన్ని.

ఆ సంభాషణ నన్నూ, నాకు సంబంధించిన వ్యక్తులనూ ఎదురెదురుగా నిలబెట్టేది. మా సంబంధాన్ని చీల్చి చూసేది. ఒక్కొక్క సంబంధం, మన తండ్రి, నీవు, లక్ష్మణుడు, రాముడు, కౌసల్య యిలా అందరితోటి నా సంబంధపు సారాంశం ఏమిటని పొరలు, పొరలు విప్పి చూశాను.

అక్కగా నిన్ను ప్రేమించినపుడు, నన్ను ఒదిలి నీ భర్తతో నువ్వెళ్ళిపోయినపుడు, మన మధ్య సంబంధంలో జరిగిన మార్పు ఎలాంటిది- ఎందుకలా జరిగింది? ప్రేమను కోపంగా మార్చే రసాయనిక చర్య మూలం ఏమిటి?

అసూయ, ద్వేషం ప్రేమ, గౌరవం- వీటి మధ్య తేడా ఎంత? అసలుందా లేక ఒకే వర్ణ ఛాయా బేధాలా? ఒక నీడలోకి ఇంకొక వెలుగు, ఒక వెలుగులోకి ఇంకొక నీడ ఎలా చొరబడుతుంది. ఏది వెలుగు? ఏది నీడ?

ఒక్కొక్క ప్రశ్న ఉదయిస్తున్నకొద్దీ నాలో సమరోత్సాహం వంటిది కలిగింది. మన పతులు ఈ పద్నాలుగేళ్ళూ రాక్షస సంహారం కోసం యుద్ధాలు చేశారని విన్నాను. దానివల్ల శాంతి చేకూరిందో, చేకూరుతుందో నాకు తెలియదు. కానీ నేనీ ప్రశ్నలతో చేసిన యుద్ధంలోంచి ఒక గొప్ప శాంతి, ఆనందం వచ్చింది."

ఊర్మిళ ముఖంలో ఆ శాంతి ప్రస్ఫుటమవుతూనే ఉంది. సీత ఊర్మిళను ఆశ్చర్యంతో చూస్తూ ఆమె మాటలను వింటూ, ఆమె చేశానని చెబుతున్న యుద్ధాన్ని ఊహించుకుంటోంది. ఆమెకు లక్ష్మణుడి గురించి ఒక ఆరాటం మొదలైంది.

"లక్ష్మణునికి నీ మీద ప్రేమ ఉంది ఊర్మిళా- అతనితో- "

సీత మాటలకు అడ్డు వచ్చింది ఊర్మిళ.

"పద్నాలుగేళ్ళ తర్వాత కలవబోతున్నాం. మేమిద్దరం- ఏమో- నేను మాత్రం చాలా మారాను. మార్పు జీవన సంకేతం. దానికి అతను ఇచ్చే విలువను బట్టే మా ఇద్దరి జీవిత గమనం సాగిపోతుంది.

నేను ద్వేషంతో కాకుండా న్యాయాన్ని గురించి ప్రశ్నించగల విజ్ఞత సంపాదించుకున్నాను. లక్ష్మణునితో నా సంబంధం అతను 'నా విజ్ఞతను ఎలా అర్థం చేసుకుంటాడు. ఎంత గౌరవిస్తాడు" అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

అతను మిగిలిన అధికారాలను ఒదలకుండా వాటికి లోబడుతూ నాపై మాత్రం అధికారాన్ని ఒదులుకుంటాడా- ఏమో- చెప్పలేను. ఏదెలా జరిగినా నా శాంతి మాత్రం భగ్నమవదు. ఆ శాంతి అవతలి వ్యక్తికి కావాలా లేదా అన్నదే విషయం.

సీత ముఖంలోని ఆందోళన ఊర్మిళకు అర్థమైంది.

తనను తాను మరింత విప్పి చెబితే సీత ఆందోళన తగ్గుతుందా- ప్రయత్నించాలనుకుంది.

"నా చుట్టూ ఉన్నవారితో నాకున్న సంబంధంలోని అధికారాన్ని గుర్తించినపుడు నాకు సమస్తం తెలిసిన భావన కలిగింది. సర్వ దుఃఖాలకూ మూలం అధికారమేనక్కా- ఇంకొక చిత్రం తెలుసా? ఈ అధికారాన్ని మనం పొందాలి. ఒదులుకోవాలి. నేను ఎవరి అధికారానికీ లొంగను. నా అధికారంతో ఎవరినీ బంధించను. అపుడు నన్ను నేను విముక్తం చేసుకున్న భావన. నాలో ఇక ఒకే ఆనందం. గొప్ప శాంతి. ఎంతో ప్రేమ. అందరి మీదా జాలి.

పాపం ఈ అధికార చట్రాలలో పడి ఎలా నలుగుతున్నారో గదా- విముక్తం అయ్యే దారి తెలియక అశాంతులతో, దుఃఖాలతో, ద్వేషాలతో కుళ్ళిపోతున్నారు గదా-

అందరికీ చెబుదామా ఈ శాంతి రహస్యం అనుకున్నాను.

కానీ ఎవరికి అర్ధమవుతుంది.?

పద్నాలుగేళ్ళు సత్యశోధనలో నే చేసిన గొప్ప తపస్సును నిద్ర అనుకున్న వాళ్ళకు నా మాటలు అర్థం అవుతాయా?

నిద్రపోయానట నేను. నిద్రకూ మెలకువకూ అర్థం తెలుసా వీళ్ళకు?

ఎన్నడైనా శాంతిగా నిద్రపోయారా? చైతన్యంతో మేలుకున్నారా?

నాది నిద్ర అంటారు- పిచ్చి అంటారు నా మాటలు వింటే-"

"లేదు ఊర్మిళా నీ మాటలు ఎంతో బాగున్నాయి. నిజంగానే నువ్వు గొప్ప తపస్సు చేశావు."

"నాకు తెలుసక్కా నీకు అర్థమవుతుందని. అందుకే ఇవాళ పెదవి విప్పాను. కాని అక్కా- నీ జీవితంలో నాకొచ్చినటువంటి పరిక్షా సమయం వస్తే అప్పుడు ఆ పరిక్ష నిన్ను మామూలుతనంలోకి, మురికిలోకి నెట్టకుండా, ద్వేషంతో, ఆగ్రహంతో నిన్ను దహించకుండా, నిన్ను నువ్వు కాపాడుకో. నీ మీద అధికారాన్ని నువ్వే తీసుకో- ఇతరులపై అధికారాన్ని ఒదులుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలటమంటే మాటలు కాదక్కా- నా మాట నమ్ము"

ఊర్మిళ మాట్లాడుతుంటే సీత మనసులోకి ఒక నెమ్మదితనం ప్రవేశించింది. ఒక్కరోజులో ఇన్నేళ్ళ ఊర్మిళ జీవితాన్ని అర్థం చేసుకోలేను అనుకుంది సీత. రామునితో ఊర్మిళ మాటలు చెప్పింది.

"ఈ అధికారం నా తమ్ముని బాధించదు గదా" అన్నాడు రాముడు.

"ఊర్మిళను చూస్తేనే బాధలన్నీ పోయేలా ఉన్నాయి" అంది సీత. అపుడపుడూ ఊర్మిళను చూస్తూ ఆమె మాటలు, ఆమె నవ్వు,ఆమె శాంతి, ఆమె కాంతి, అన్నింటినీ ఆస్వాదిస్తూ ఉంది సీత.

***

లక్ష్మణుడు అరణ్యంలో ఒదిలి వెళ్ళాక, నట్టనడి సముద్రంలో మునిగి ఉన్నానని పించినపుడు సీత కళ్ళముందు ఊర్మిళ కదలాడింది.

జీవితంలో ఎడబాట్లూ అపనిందలేనా దక్కిందని ప్రశ్నించుకుని అరణ్యరోదనం చేస్తున్న సమయంలో సీతకు ఊర్మిళ మాటలు గుర్తొచ్చాయి.

ఊర్మిళకు చెప్పకుండా లక్ష్మణుడు రాముని వెంట అరణ్యవాసానికి వెళ్ళాడు.

తనకు చెప్పకుండా రాముడు తనను అరణ్యాలలో వదిలేసిరమ్మని లక్ష్మణుడిని నియోగించాడు.

ఊర్మిళ సత్యాగ్రహమో, తపస్సో ఏదో చేసి తనను తాను కాపాడుకుంది.

"అధికారాన్ని తీసుకో. అధికారాన్ని ఒదులుకో. అప్పుడు నీకు నువ్వు చెందుతావు. నీకు నువ్వు దక్కుతావు. మనకు మనం మిగలాలి." ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా ఊర్మిళ ఈ మాటలే మళ్ళీ మళ్ళీ చెప్పింది. అవి తనకు ఊర్మిళ గురించిన అశాంతిని తగ్గించాయి. అంతే.

ఇపుడు తను సత్యాగ్రహం ప్రారంభించాలా? ఆగ్రహం తగ్గేదెప్పుడు? సత్యం బోధపడేదెన్నడు? ఎట్లా–

రాముని మీద ఎనలేని అనురాగం. ప్రేమ. ఆ రాముని నుంచి విముక్తి ఎలా దొరుకుతుంది?

ఎలాంటి పరిక్ష ఇది. అగ్ని పరిక్ష ఏ పాటిది దీనిముందు– తనకు యుద్ధవిద్యలన్నీ వచ్చు. ఎన్నడూ ఎవరిమీదా యుద్ధం చెయ్యలేదు. ఇపుడు తనమీద తనే యుద్ధం చేసుకోవాలి.

యుద్ధం మొదలైంది. ఎన్నేళ్ళు సాగుతుందో.

***

"రామచంద్రుడు అశ్వమేధయాగం చేస్తున్నాడమ్మా. ఆహ్వానం పంపించాడు. నే వెళ్ళి వస్తానమ్మా" అని చెప్పాడు వాల్మీకి మహర్షి.

మహర్షి కాసేపు సీత సమాధానం కోసం చూసి, చివరకు వెళ్ళిపోవటం సీతకు తెలియదు. ఆమె దేనినీ గమనించే స్థితిలో లేదు.

అశ్వమేధయాగం రాముడెలా చేస్తాడు? తను పక్కన లేకుండా ఎలా?

తన స్థానంలో ఎవరు కూచుంటారు?

సీత మనసులో జ్వాల రేగింది.

"ఎవరు కూచుంటేనేం? నీకేం సంబంధం"

సీత మనసు చదివేసినట్లు మాట్లాడుతూ నవ్వుతూ వచ్చింది ఊర్మిళ

"ఊర్మిళా– నువ్వు" సీత ఆశ్చర్యానికి మేరలేదు.

"నేనే వచ్చాను. నువ్విక్కడ ఉన్నావని లక్ష్మణుడు చెప్పాడు. అశ్వమేధ యాగవార్త నీకు చేరుతుందని తెలుసు. నీ మనసులో అది ఎలాంటి భూకంపం బయల్దేర దీస్తుందో కూడా ఊహించాను. ఆ సమయంలో నిన్ను నిన్నుగా మిగల్చాలని వచ్చాను."

సీత ఊర్మిళను ఆలింగనం చేసుకుని పక్కన కూచోబెట్టుకుంది. చాలాసేపటి నిశ్శబ్దం తర్వాత, ఆ నిశ్శబ్దంలో అనేక మాటలు నడిచాక.

"యాగం శ్రీరామచంద్రుడే చేస్తున్నాడా?" అడిగింది సీత.

"మరెవరు చేస్తారు? చక్రవర్తులే గదా చెయ్యాలి"

"నేను లేకుండా ఎలా–"

"ఆ ప్రశ్న నీకెందుకు రావాలి? వస్తే రామునికి రావాలి? యాగం చేయించే వారికి రావాలి. అనవసరమైన ప్రశ్నలతో అశాంతి పడటం అవివేకం కాదా?" తను సీతకంటే పెద్దదానిలా పలికింది ఊర్మిళ.

"నీకు తెలుసు. చెప్పు ఊర్మిళా రాముని పక్కన కూర్చునేదెవరు?"

"నేను నీకు సమాధానం చెప్పి నీ అగ్నిని తాత్కాలికంగా చల్లార్చటానికో మరింత ప్రజ్వలింప చేయటానికో రాలేదు. అనవసరమైన ప్రశ్నలతో నిన్ను నువ్వు హింసించుకోవద్దని చెప్పటానికే వచ్చాను."

"కానీ నేనిది మింగలేకపోతున్నాను."

"మింగవద్దు. అసలది నీ మనసులో ప్రవేశించనే వద్దు. నువ్వు రాముడి నుంచి విముక్తం కావాలి"

"ఊర్మిళా–"

సీత వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎన్ని పరిక్షలు ఊర్మిళా"

"ప్రతి పరీక్షా నిన్ను రాముడి నుంచి విముక్తం చెయ్యటానికే. నిన్ను నీకు దక్కించటానికే. యుద్ధం చెయ్యి. తపస్సు చెయ్యి. లోపలికి చూడు, నీవనే యదార్థం కనపడేదాకా చూడు–"

"చాలా కష్టంగా ఉందమ్మా" సీత గొంతులోంచి మాట కష్టంగా వచ్చింది.

"చాలా హాయిగా కూడా ఉంటుందక్కా ప్రయత్నించు. మరి నే వెళ్తాను" ఊర్మిళ లేచింది.

"అప్పుడేనా? నా పిల్లల గురించి వినవా? వారిని చూడవా?"

"వాళ్ళు నా దగ్గరకు వస్తే, నన్ను చూడాలని వస్తే తప్పకుండా చూస్తాను"

***

ఊర్మిళ ఎంత హఠాత్తుగా వచ్చిందో అంత హఠాత్తుగా వెళ్ళింది. సీత మనసులో జ్వాల మాత్రం అంత హఠాత్తుగా ఆరలేదు.

ఎక్కడెక్కడో మూలమూలల దాగిన నిప్పురవ్వలు, ఎప్పటి నుంచో నివురు గప్పిన నిప్పులు కణకణ మండసాగాయి. ఆ మంటలో సుఖాన్ని అనుభవించటానికి అలవాటుపడుతున్న సమయంలో సీతకు వాటిని ఆర్పాలని తెలిసింది.

రాముడిని ప్రేమించటం సుఖమా, రామునిపై ఆగ్రహించటం సుఖమా అనే ద్వైదీభావంలో మనసు కొట్టుమిట్టాడటం సీతకు తెలిసీ తెలియని స్థితిలో జరిగింది.

ఆగ్రహాన్ని రగిలించుకోవటంలో, జ్వాలను పెద్దది చేయటంలో బాధగా కనపడే సుఖాన్ని పట్టుకోవటం తేలిక కాదు.

రాముడిపై ప్రేమ ఇచ్చే సుఖంలోని బాధను తట్టుకోవటమూ తేలిక కాదు. ఈ రెండిటినీ దాటి రాముడినుంచి విముక్తమయ్యే యత్నం యాతనాభరితమైంది సీతకు.

ఐనా సీత ఆ తపస్సు చేసింది.

కల్లోల కడలి శాంతి సాగరమయ్యేదాకా మథనం సాగించింది.

క్రమంగా ఆ శాంతి సీతను ఆసాంతం ఆవరించింది.

వాల్మీకి అశ్వమేధయాగం చూసి వచ్చేనాటికి సీత మనసు పూర్తిగా తేట పడింది.

రాముని పక్కన యాగంకోసం కూర్చున్నదెవరు? అని అడగొచ్చని వాల్మీకిని చూసిన తర్వాత కూడా సీతకు తోచలేదు.

వాల్మీకి కొన్ని రోజుల తర్వాత సీతకో విషయం చెప్పేందుకు వచ్చాడు.

"రాముడు లవకుశులను స్వీకరించాడు. సీతనూ స్వీకరించాడు. ఐతే సీత వచ్చి నిండు సభలో తను నిర్దోషినని ప్రకటించుకోవాలి"

ఈ మాటలు సీత ప్రశాంతంగానే విన్నది. చిరునవ్వుతోనే విన్నది.

"అంత అవసరం ఉందంటారా నాకు" అని మాత్రం అన్నది.

శాంతస్మిత వదనంతో పిల్లల నుంచి కూడా విముక్తురాలై తానెక్కడ నుంచి వచ్చిందో అక్కడికి ప్రయాణమైంది.

ఆదివారం ఆంధ్రజ్యోతి, 7 మార్చి 2010